నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com





## కర్నూలు | నంద్యాల

బుధవారం | 26 ఫిబ్రవరి 2025 పేజీలు 8


### సింహ, సూర్య ప్రభ వాహనాల పై

# విహరించిన స్వామి వారు



మహానంది పుణ్యక్షేత్రంలో సూర్య ప్రభ వాహన సేవ

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలలో భాగంగా రెండవ రోజున ఉదయం సూర్య ప్రభ, సాయంకాలం సింహ వాహన సేవలపై స్వామివార్లు విహరించా రు. మంగళవారం ఉత్సవాలలో భాగంగా మూల విరాట్‌లైన శ్రీ కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామివార్లకు వేదపండి తుల వేదమంత్రాలతో విశేష పంచామృత అభిషేకాలను, అర్చనలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, మిగతా 2లో




## అదిగదిగో శ్రీశైలం..

# భూలోకాన కైలాసం

శ్రీశైలం శివ నామస్మరణతో మార్మోమోగుతుంది.ఎటు చూసిన ఓంకార ధ్వనులే వినిపిస్తున్నాయి. మల్లన్న సన్నిధిలో జాగరణ చేసేందుకు లక్షలాది మంది భక్తులు కొండపైకి చేరుకున్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజు మంగళవారం రాత్రి గజ రాజుపై మల్లికార్జునుడి వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని ఆలంకార మండపంలో ఉత్సవమూర్తులను గజ వాహనంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు.నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి,జెసి విష్ణు చరణ్,ఎస్పీ విక్రాంత్ పాటిల్,ఈవో శ్రీనివాసరావు గంగాధరమండపం వద్ద గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.వైభవంగా జరిగిన ఈ గ్రామోత్సవంలో జాన పద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్,డప్పులు,తప్పెట్లు, మేళతాళాలు,భజంత్రీలు, సుఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది.గజ వాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శ్రీశైలం,మేజర్ న్యూస్:





### యాగంటిలో ప్రారంభమైన

# బ్రహ్మోత్సవాలు

- మంగళవారం నాడు ధ్వజారోహణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలను కొలువుదీరుస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్,న్యూస్ః** యాగంటి శ్రీ ఉమామహే శ్వరస్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవా లు మంగళవారం ధ్వజారోహ ణముతో వైభవంగా ప్రారం భమయ్యాయి. ఆలయ ఈ.ఒ బి. చంద్రుడు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాల సందర్భంగా గర్భలయంలో శ్రీ ఉమామహేశ్వరస్వామి విగ్రహాలకు ఎదురుగా అలం కార మండపంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజలు గణపతి పూజ, పుణ్యాహ వాచనము, దీక్షా కంకణా ధారలను భక్తిశ్రద్ధలతో చేపట్టి ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్థంభం వద్ద ఉత్సవ విగ్రహాల ను కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, అర్చకులు సత్యనారా యణ శర్మ, లోకనాథ్ శర్మ, దేవేంద్ర శర్మ, రాఘవేంద్ర శర్మ, కిశోర్ శర్మలు పూజలు మిగతా 2లో






## శ్రీ మహానందీశ్వర స్వామి వారి దేవస్థానము

### మహానంది - నంద్యాల జిల్లా

### 2025 మహా శివరాత్రి బ్రహ్మోత్సవముల ఆహ్వానము

| తేది : వారము | | ఉదయం | సాయంత్రం | రాత్రి |
|---|---|---|---|---|
| 24.02.2025 | సోమవారం | | ధ్వజారోహణం | మయూర వాహన సేవ |
| 25.02.2025 | మంగళవారం | సూర్యప్రభ వాహన సేవ | | సింహ వాహన సేవ |
| 26.02.2025 | బుధవారం | రావణ వాహన సేవ | | నంది వాహన సేవ |
| | మహాశివరాత్రి : | రాత్రి గం. 10.00ల నుంచి లింగోద్భావ కాల మహారుద్రాభిషేకము | | |
| | | రాత్రి గం 3.00ల నుండి శ్రీ స్వామివార్ల కళ్యాణ మహోత్సవము | | |
| 27.02.2025 | గురువారం | శేష వాహన సేవ | | పుష్ప పల్లకి సేవ |
| 28.02.2025 | శుక్రవారం | అశ్వ వాహన సేవ | రథోత్సవము | పుష్పశయనోత్సవము |
| 01.03.2025 | శనివారం | మహాపూర్ణాహుతి & నాగబలి పూజ | త్రిశూల స్నానము ధ్వజ అవరోహణం | తెప్పోత్సవము |



శ్రీ ఎన్.శ్రీనివాసరెడ్డి
కార్యనిర్వాహణాధికారి

కావున భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి శివరాత్రి బ్రహ్మోత్సవములను ప్రత్యక్షంగా వీక్షించి సకల ఐశ్వర్యములు పొందగలరని కోరుచున్నాము. మరియు దేవస్థానము నందు నిర్మించబోవు వసతి గదులు, కాటేజీలు నిర్మించుటకు మరియు దేవస్థానము నందలి నిత్యాన్నదాన పథకమునకు గాను మహోన్నత మహారాజ పోషకులు రూ. 1,00,116/-, మహారాజ పోషకులు రూ. 51,116/-, రాజపోషకులు రూ.25,116/- పోషకులు రూ. 5,116/- లు విరాళములుగా చెల్లించి శ్రీ స్వామి అమ్మవార్ల అనుగ్రహానికి పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.

సూర్య



# సింహ,సూర్య ప్రభ వాహనాల పై విహరించిన స్వామి వారు

(మొదటి పేజి తరువాయి)



సింహ వాహనంపై కొలువు తీరిన స్వామి, అమ్మవార్లు

కలశ పూజలు, అంకురార్పణ పూజలను వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మ, శాంతారామ్‌భట్‌లతో ప్రత్యేక వేదపండితుల వేద మంత్రాలతో విహరించారు.

**సూర్య ప్రభ వాహన సేవ :** ఉత్సవాలలో భాగంగా రెండవ రోజున శ్రీ గంగా కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లను సూర్య ప్రభ వాహనంపై కొలువు తీర్చి ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిచే వేదపండితులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఓంకార నామ స్మరణల మధ్య ఆలయ మాడా వీధులలో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

**సింహ వాహన సేవ :** మహానంది పుణ్య క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజున సాయంకాలం సింహ వాహనంపై మహానంది మాడా వీధులలో శ్రీ స్వామివార్లు విహరించారు. సాయంకాలం శ్రీ గంగా కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామివార్లను సింహ వాహనంపై కొలువు తీర్చి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం స్వామివార్ల గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా భక్తుల ఓంకార నామ స్మరణలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏఈవో మధు, తదితర అధికారులు పాల్గొన్నారు.



నందికోళ నృత్యాలు



హోమాలు చేస్తున్న వేదపండితులు



శివభక్తులు ధ్యానం చేస్తున్న దృశ్యం

# అదిగదిగో శ్రీశైలం..భూలోకాన కైలాసం

(మొదటి పేజి తరువాయి)

**శ్రీగిరికి పోటెత్తిన భక్తులు.. :** మహాశివరాత్రి అత్యంత పవిత్రమైన రోజు. మహా శివరాత్రి నాడు ఉపవాసం ఉండి జాగరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని విశ్వసించిన లక్షలాది మంది భక్తులు శ్రీ గిరి చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తు లతో శ్రీగిరి పోటెత్తింది. భక్తుల శివనామస్మరణతో మారుమోగుతుంది. క్షేత్రంలో శివస్వాములు, భక్తుల శివభజనలు, శివ నామస్మరణ, ఓంకార ధ్వనులతో శ్రీశైలం మరింత ఆధ్యాత్మికతను సంతరించుకుని కైలాసాన్ని తలపిస్తుంది.

## నేడు మహాశివరాత్రి పర్వదినం :

**పరమశివునికి పాగాలంకరణ ప్రత్యేకం**

**అర్ధరాత్రి మహారుద్రాభిషేకం, స్వామిఅమ్మవార్లకు కల్యాణం**

**జాగరణకు తరలివస్తున్న భక్తజనం**

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో శ్రీగిరికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ మల్లన్నకు జరిగే విశిష్ట సేవలు దేశంలోనే ఏ క్షేత్రంలో జరగవు. శ్రీశైలంలోమల్లన్నకు పాగాలంకరణ ఒక విశిష్ట సేవ. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ కాలంలో జరిగే ఈ సేవ వెనుక ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. పాగాలంకరుడైన మల్లన్నను చూసేందుకు భక్తుల రెండు కళ్లు చాలవు, భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశాన్ని పంచభూతాలుగా పరిగణిస్తారు. వీటి సమ్మేళనమే ఈ భౌతిక ప్రపంచం. ఈ పంచభూతాలకు ప్రతీకలుగా మల్లన్న అలయంలోని ఐదు కలశాలు, స్వామివారి గర్భాలయ విమాన గోపురానికి మధ్యలో ఒకటి, నాలుగు మూలలో నాలుగు కలశాలు ఉన్నాయి. గర్భాలయ ముఖమండపంపై తొమ్మిది నందులు ఉన్నాయి. ఈ నవ నందులను. ఐదు కలశాలను కలిపి పాగా చుడతారు. 4 కలశాలు, 9 నందులు మొత్తం 14. అంటే 14 లోకాలను ఏలే శ్రీలింగ చక్రవర్తికి ఈ సంఖ్యతో కూడిన పాగాలంకరణ జరగడం విశేషం. తద్వారా 14 లోకాలకు మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండా లని, లోక కల్యాణం జరగాలన్న ఆకాంక్షలను స్వామివారికి భక్తులు తెలియజేయవమే ఈ పాగాలంకరణ వెనుక ఉన్న మరో విశేషం. సాలె గూడు శ్రీకాళహస్తి శ్వర మహాత్యం గురించి తెలియని శివ భక్తులు ఉండరు. అందులో శ్రీ అంటే సాలె పురుగు, శివలింగంపై ఎండపడకుండా భక్తితో అది గూడు అల్లుతుంది. తద్వారా పరమశివుడి అనుగ్రహం పొందుతుంది. శ్రీశైలం మల్లన్నకు జరిగే పాగాలంకరణ సాలె గూడును పోలీ ఉంటుంది. 14 చుట్లు చుట్టిన పాగాలంకరణ దర్శనం వలన 14 ఇంద్రియాలు నిర్మలమైన బాధల నుంచి విముక్తి పొందుతాయన్న ఆర్వాత్మిక సందేశం ఇందులో ఇమిడి ఉంది.

# పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**:– ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి**

**:– జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా**

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పకడ్బందీగా, ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పది (పబ్లిక్) పరీక్షల నిర్వహణ పకడ్బందీ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17 నుండి 31వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు, మార్చి 17 నుండి 28వ తేదీ వరకు జరిగే పదవ తరగతి ఓపెన్ పరీక్షలకు, మార్చి 3 నుండి మార్చి 15వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని పరీక్షల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా మొత్తం 172పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో 40,776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. గత రెండు, మూడేళ్లలో జరిగిన ఇన్సిడెంట్లను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మకంగా గుర్తించిన సెంటర్ల వివరాల లిస్టును పోలీసు అధికారులకు, తహశీల్దార్లకు ఇవ్వాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటుకు సంబంధించిన ప్రొసీడింగ్‌లు ఇచ్చేందుకు డిఆర్ఓతో కోఆర్డినేట్ చేసుకోవాలని కలెక్టర్ డిఈఓను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర ఆర్మ్ గార్డ్స్‌ని ఏర్పాటు చేయాలని, పేపర్ డిస్ట్రిబ్యూషన్ కి ఎస్కార్ట్‌తో వెళ్లాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండాలని, తాగునీటి వసతి కల్పించాలని, సరైన సమయానికి చేరుకునేందుకు బస్సు సదుపాయాలు కల్పించాలని, రవాణా విషయంలో ఆర్టీసి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

# యాగంటిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజి తరువాయి)



లడ్డూ పంపిణీ చేస్తున్న దృశ్యం

నిర్వహించిన అనంతరం బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానించే వీలుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత లడ్డూ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఒ బి. చంద్రుడు, యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌలీశ్వర రెడ్డి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, బత్తుల భాస్కర్ రెడ్డి, బండి మల్లేశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిప్పంటించిన దుండగలు..రైతునోట్ల బూడిద

**– రూ. 2లక్షలకు పైగా ఆస్తినష్టం – లబోదిబోమంటున్న రైతు**



కాలి బూడిదైన కందిపంట

**కోసిగి మేజర్ న్యూస్:** అష్టకష్టాలుపడి లక్షల్లో పెట్టుబడి పెట్టి చేతికొచ్చిన పంటను కోతకోసి పొలంలో నిల్వ ఉంచిన పంటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి రైతునోట్లో బూడిద కొట్టిన సంఘటన కోసిగి మండలంలోని కామన్‌దొడ్డి గ్రామంలో చోటుచేసుకొంది. రైతు సుదర్శన్ వివరాల మేరకు తనకున్న మూడెకరాలకుపైగా ఉన్న పొలంలో కందిపంటను సాగుచేసుకోవడం జరిగిందన్నారు. ఈ సాగుకు లక్షలాది రూపాయలు పెట్టిబడిపెట్టి సాగుచేసుకోగా.. పంట మంచి దిగుబడివచ్చిందన్నారు. అయితే సోమవారం కందిపంటను కోతకోసి పొలంలోనే నిల్వ ఉంచామన్నారు. రెండురోజుల తరువాత పంటను రాపిడిచేసి పంటను అమ్ముకోవడానికి సిద్దంచేసుకొన్న ఆశలన్ని ఆవిరయ్యాయని రైతు లబోదిబో మంటున్నాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించివచ్చి ఉండవచ్చుని, లేక కక్షపూరితంగానే తన కడపు కొట్టారని రైతు సుదర్శన్ బోరున విలపించారు. కందిపంటకు నిప్పంటించి మానోట్లో బూడిదన కొట్టినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని రైతు కోరారు. కందిపంట దగ్ధం కావడంతో దాదాపుగా 2లక్షలవరకు ఆస్థినష్టం జరిగిందని రైతు వాపోయారు.



బాధను వ్యక్తంచేస్తున్న రైతు సుదర్శన్

# రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణాపై నిఘా ఉంచాలి

**– తుంగభద్ర నదీ తీరంలో సబ్ కలెక్టర్ పరిశీలన**



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణాపై నిఘా ఉంచాలని ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్ అన్నారు. మంగళవారం స్థానిక తుంగభద్రనదీ తీరంలో పర్యటించి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేయాలని ఎస్.రవి, సిఐ రామాంజులుకు ఆదేశాలు జారీ చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఇసుక విధానంలో అక్రమార్కులు, ప్రభుత్వ పనుల పేరుతో అనుమతులు తీసుకొని తుంగభద్రనదీలో రాత్రి అక్రమంగా ఇసుకను తవ్వి పక్కదారి పట్టించి ట్రాక్టర్ రూ. 2వేల నుంచి రూ. 3వేలవరకు అమ్ముకుంటూ, సొమ్ము చేసుకుంటున్నారని అడ్డుకట్ట వేయాలని సూచించారు. రాత్రి వేళల్లో నిఘా ఉంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు.

# నేడు బ్రహ్మగుండం క్షేత్రానికి ఉచిత బస్సు ఏర్పాటు

**చెరుకులపాడు వైస్ ఎంపిపి బత్తిన రాజేశ్వరి**



**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు కె. ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మల ఆశీస్సులతో మాజీ ఎంపిటిసి కీశే. బత్తిన మల్లయ్య జ్ఞాపకార్థం మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వెలసిన శ్రీకామేశ్వరిదేవి సహిత బ్రహ్మగుండం పుణ్యక్షేత్రానికి బుధవారం 26వ తేది వెల్దుర్తి పట్టణం నుండి బ్రహ్మగుండం పుణ్యక్షేత్రానికి(జాగరణ) వెళ్ళే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు చెరుకులపాడు వైస్ ఎంపిపి బత్తిన రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండల ప్రజలు, భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని స్వామి వారి దర్శనభాగ్యం చేసుకొని, స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సూర్య



# వార్డుల్లో విస్తృత పర్యటన...సమస్యలపై ఆరా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**నంద్యాల పట్టణంలోని 13వ వార్డు, 20వ వార్డుల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ విస్తృతంగా పర్యటించి సమస్యల గురించి వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాగులకట్ట, టెక్కె, భరతమాత గుడి, లలితానగర్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి సమస్యలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తాగునీరుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వార్డులలో కుంగిపోయిన కరెంటు స్తంభాలు, వేలాగే తీగెలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పార్క్ కంపతో నిండిపోవడం, కంపచెట్లు ఏపుగా పెరగడంతో



వార్డుల్లో సమస్యలను పరిశీలిస్తున్న ఎన్ఎండి ఫిరోజ్

ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మన ఊరు మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా ఫిరోజ్ 13,20వార్డుల్లో పర్యటనకు చేరుకోవడంతో వార్డు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఏళ్ళ తరబడి నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వ అధికారులతో అక్కడికక్కడే చర్చించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రి ఫరూక్ దృష్టికి తెచ్చి వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభిచేలా కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో 13వ వార్డు ఇన్‌చార్జి మధుసాయి, 20వ వార్డు ఇన్‌చార్జి సుంకన్న, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, మునియార్ ఖలీల్, మల్లికార్జున, దీపక్‌రెడ్డి, బాల వీరయ్య, 19వ వార్డు పొన్నాపురం కాలనీ ఇన్‌చార్జి మున్నా, తోటరామయ్య, రామిరెడ్డి, పద్మ, పావని, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత ఉమెన్స్ డే క్రియేటివ్ అంశంపై పోటీలు



పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారిత ఉమెన్స్ డే క్రియేటివ్ కాంటెస్ట్ అంశంపై నిర్వహించే పోటీల పోస్టర్‌ను మంగళవారం రామకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి సమక్షంలో విడుదల చేశారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏడాది మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా కళాశాలలో ఉన్న ఉమెన్ ఎంపర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిజిటల్ ప్లాట్ ఫామ్‌పై ఉమెన్స్ డే క్రియేటివ్ కాంటెస్ట్ పేరుతో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇన్‌స్టా గ్రా మ్ డిజిటల్ మేకింగ్ 30 నుంచి 60నిమిషాలు, యూట్యూబ్ వీడియోలు 5నిమిషాలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఉన్న అనేకమైన ఉద్యోగ అవకాశాలు పట్ల ఆసక్తిని కలిగించడం డిజిటల్ ప్లాట్‌ఫాంలో యువత వ్యక్తిత్వ వికాసానికి వారిలో ఉన్న సృజనాత్మకతను ఉపయోగించుకోవడానికి అనుకూల దృక్పథంలో కూడా ఎలా ఉపయోగించు కోవాలో అవగాహనపై ఆసక్తిని కలిగించడంపై హేమంత్‌రెడ్డి డిజైన్ చేసిన విధంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రగతి మాట్లాడుతూ ఒక నూతన దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని పోటీలను నిర్వహిస్తున్నామని పోటీలను నిర్వహిస్తున్నామని విద్యార్థులు తమలో దాగిన ప్రతిభను వెలికి తీసే ఇలాంటి మంచి వేదికలను ఉపయోగించుకోవాలని ఆసక్తిని కనబరచాలని అన్నారు. ఈకార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కుమార్ , డాక్టర్ లలితా సరస్వతి అధ్యాపకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందించాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే మేథోశక్తి పెంపొందించాలని లీడర్స్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ దీపాలి జాదవ్ అన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జాదవ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఖాలీద్ సైపుల్లా రైతుల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ రైతు పండిస్తేనే జీవన మనుగడ సాధ్యమని రూపొందించిన ప్రాజెక్టు ప్రతి ఒక్కరినీ అకట్టుకుంటుందని అన్నారు. పిల్లల్లో ఉన్న మేథోశక్తిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రొత్సహిస్తూ వారి ఎదుగుదలకు మరింత కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువురు సైపుల్లాను అభినందించారు.



రైతు ప్రాముఖ్యతపై ప్రాజెక్టుతో విద్యార్థి

# మహిళల అభివృద్ధి కొరకు సహకార రుణాలు

**మహానంది, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతి కొరకు స్వయం సహాయక రుణాలను అందజేస్తున్నాయని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్ బాబు, ఐపిఓ చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. మంగళవారం బుక్కాపురం పొదుపు సమాఖ్య భవనంలో మహిళలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా హాజరైన వారు మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై ఇస్తున్న ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతిఒక్కరు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటూ తాను లబ్ధిపొందుతూ నలుగురికి ఉపాధి కల్పించే విధంగా చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వారు ఏర్పాటు చేసుకునే పరిశ్రమను బట్టి స్వయం సహాయక రుణాలు అందుతాయని సబ్సిడితో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. మూడు రోజుల శిక్షణా తరగతులు ముగిసాయి. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నాగేంద్ర ప్రసాద్, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్ హుస్సేన్ బాబు, అల్లాబాషా, ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, ఈఓఆర్‌డి నాగేంద్రుడు, ఏపీఎం తిరుపాల్ రెడ్డి, సిసి కిషోర్ రెడ్డి, ఎల్‌డిఎం రవీంద్ర బాబులు పాల్గొని మహిళలకు శిక్షణా తరగతులు నిర్వహించారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ జవహర్ బాబు

# ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం

**కల్లూరు, మేజర్ న్యూస్ ః** ఆరురోజుల జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళ వారం కల్లూరు నందు ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్‌పిలు,అంగన్‌వాడి సూపర్‌వైజర్లు, టీచర్లు మొత్తం 100మంది పాల్గొన్నారు. అనేక రకాల కృత్యాలను చేసి అలరించారు. వివిధ రకాలైనటువంటి టీచింగ్ మెటీరియల్‌ను తయారు చేసి మేళాను ఏర్పాటు చేసి ముగింపులో నిర్వహించడం జరిగింది. ఎంఈఓలు శ్రీనివాసులు, వనజా కుమారి, హెచ్ఎం హంసేన్‌తో పాటు కెఆర్‌పిలు మనోహర్,ఆనందం,వెంకట కృష్ణుడు, సిఆర్‌ఎంటిలు గిరిజ, రాముడు,మంజులావాణి,ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ చోటేమో,అనుష, జామీలాబీ పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు,అంగన్‌వాడి కార్యకర్తలు

# ప్రభుత్వ ఆసుప్రతిలో మందుల కొరత లేదు..!

**ః– సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు**



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ ః** ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత లేదని ఆసు పత్రి సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాజువాలిటీ, అత్యవసర విభాగాలలో మందుల కొరతపై ఆరాతీ శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆసుపత్రిలోని పలు రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. క్యాజువా లిటీ,ఎమర్జెన్సీ విభాగాలలో మందుల కొరత లేదని ఎమర్జెన్సీ మెడిసిన్ కొరకు ప్రత్యా మ్నాయ చర్యలు తీసుకున్నామన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని ఎవరైనా బయటికి రాస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు ఏవైన సమస్య లుంటే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాన న్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ

**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** అంగన్‌వాడి కార్యకర్తలకు ఈ నెల 18నుంచి 25వ తేదీ వరకు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయని ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్ తెలిపారు. చివరిరోజు ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసులు,ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్,ఏసిడిపిఓ బాలమణి, సిడిపిఓ అనురాధలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజుల పాటు ఇసిసిఇ, ఐసిడిఎస్, శారీరక అభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, భాష అక్షరాస్యత అభివృద్ధి, సౌందర్య సాంస్కృతిక అభివృద్ధి, ఐదు డొమైన్లు శిక్షణ మరియు ఇసిసిఇడే, బర్త్ డే వేడుకలు, 3నుండి 6సం॥ల పిల్లల మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందనే విషయాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని చివరిరోజు టిఎల్ఎం మేలాను, గ్రాడ్యుయేషన్ డేను అంగన్‌వాడి సెంటర్‌లో ఎలా నిర్వహించాలో చేసి చూపించామని తెలిపారు. ఆర్పీలుగా పోలు నాయక్,నజ్మహితుల, బాలముణి, నిరంజన్ గౌడ్,రామలింగేశ్వర్‌రెడ్డిలు వ్యవహరించి శిక్షణ ఇచ్చారన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఎలక్ట్రిక్ బైక్ ఎండీకి నాన్ బెయిలబుల్ వారెంట్

**కల్లూరు, మేజర్ న్యూస్ ః** జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ ఆదేశాలను పట్టించుకోని ఎలక్ట్రిక్ బైక్ ఎండికి మంగళవారం వినియోగదారుల కమీషన్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేశారు. వివరాల్లోకి వెళితే ఓ ప్రభుత్వ ఉద్యోగి బైక్ కొనుగోలు చేయగా మరమత్తులకు గురవుతుండడంతో వినియోగదారుల కమీషన్‌ను సంప్రదించారు. విచారణ చేసి బైక్ కొనుగోలు మొత్తాన్ని 9శాతం వడ్డీతో చెల్లించి మరో రూ.25వేలు పరిహారం ఇవ్వాలని గతంలో కమీషన్ తీర్పు ఇచ్చింది. ఎండి ఆ ఆదేశాలను పట్టించుకోకపోవడంతో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్‌ను జారీ చేశారు.

# బ్రహ్మోత్సవాలకు పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు

**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ ః** కాల్వ బుగ్గలో బ్రహ్మోత్సవాలకు పోలీసు బందోబస్తు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గ రామేశ్వర స్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన భద్రత ఏర్పాట్లను టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబునాయుడు,ఆలయ ఈఓ మద్దిలేటితో కలిసి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు,క్యూలైన్లు గుడి పరిసరాలు పరిశీలించారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ అన్ని రకాల భద్రత చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



భద్రత ఏర్పాట్ల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న సిఐ

## ఈ నెల 28లోపు
# జీవన ప్రమాణ ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిథి ః** ఈ నెల 28వ తేదీలోపు జీవన ప్రమాణ ధృవీకరణ పత్రాలు ఖజానా కార్యాలయంలో సమర్పించాలని జిల్లా ఖజాన అధికారి బి రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18,707ి ఎంచన్‌దారులకు గాను 15701మంది జీవన ప్రమాణ్ ధృవీకరణ పత్రాలు సమర్పించారని ఇంకా 3,006మంది ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కదలలేని పించన్‌దారుల వివరాలు తెలియజేస్తే ఖజానా సిబ్బంది ద్వారా పించన్‌దారుల ఇంటి వద్దనే జీవన్ ప్రమాణ్ ధృవీకరణ పత్రాన్ని ప్రభుత్వ యాప్ ద్వారా అందిస్తున్నారని తెలియజేశారు. పించన్‌దారుల సమస్యలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఖజాన అధికారి రామచంద్రరావు

సూర్య
బుధవారం | 26 ఫిబ్రవరి 2025



నల్లమల అభయారణ్యంలో వెలసిన మహిమాన్విత క్షేత్రం కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు అని భక్తుల విశ్వాసంఅటవీశాఖ అనుమతులతో అడవిలో కష్టసాధ్య ప్రయాణంప్రతిరోజు 120 మందికి మాత్రమే అమ్మవారి దర్శనం అమ్మవారి దర్శనానికై పాదయాత్రగా శివ స్వాములు.. సాధారణ భక్తులు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయానికి పెరిగిన భక్తుల రద్దీ దట్టమైన నల్లమల అభయారణ్యంలో బండరాళ్ల మధ్య కుదుపులతో కూడిన ప్రయాణం.అనుక్షణం భయం, ఉత్కంఠ,ఆహ్లాదం,ఆనందం ఇవన్నీ కలగలపి చేసే యాత్రే ఇష్టకామేశ్వరీ దేవి దర్శనయాత్ర.ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం గంజివారి పల్లె బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వెలసిన ఇష్టకామేశ్వరి దేవతను దర్శించుకోవాలంటే కొంచెం సాహసమే....ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయంపై

**సూర్య ప్రత్యేక కథనం...**

# భక్తుల కొంగు బంగారం

# ఇష్ట కామేశ్వరీ దేవి








**శ్రీశైలం,మేజర్ న్యూస్:**

భారతదేశం మొత్తం మీద ఆ దేవి రూపాన్ని..ఒక్క క్షేత్రంలో మాత్రమే దర్శించుకోగలం.అందుకే ఆ దేవి దర్శనం ఒక సాహసయాత్ర, దట్టమైన నల్లమల అభయారణ్యం లోని ఓ చిన్న గుహలో వెలసిన  వెలసిన జగజ్జనని దర్శనంతో ఆ తల్లి మన ముందు సజీవంగా నిలిచిన అనుభూతినిస్తుంది. ఒకప్పుడు కేవలం కాపాలీకులు, సిద్ధులు మాత్రమే సేవించిన మహామహన్విత ఇష్ట కామేశ్వరిదేవిని నేడు సామాన్య భక్తులు కూడా దర్శించు కోగలుగుతున్నారు.చెంచు గిరి జనుల నివాసాల మధ్య బండరాళ్లను పేర్చి కట్టిన చిన్న మండపానికి ముందు రేకుల షెడుతో సాదాసీదాగా ఉంటుంది ఇష్టకామేశ్వరి దేవీ ఆలయం. జగద్గురువులు ఆది శంకరాచార్యులతోపాటు ఎంతో మంది సిద్ధులు అమ్మవారిని దర్శించుకుని అక్కడే సాధన చేశారని పురాణాలు చెపుతున్నాయి.ప్రసిద్ధ శ్రీశైల పుణ్యక్షేత్రంలో కొద్దిమందికి మాత్రమే తెలిసిన మహాన్విత క్షేత్రం ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం. శ్రీశైలంలో ఉన్న గొప్ప రహస్యాల్లో ఇష్టకామేశ్వరి ఆలయం కూడా ఒకటని చరిత్రకారులు పేర్కొంటు న్నారు.ఎంత గొప్ప కోర్కైనా ఈ అమ్మవారిని కోరు కుంటే తీరుతుందని పురాణాల్లో నానుడి, భక్తుల విశ్వాసం.

**ఆకట్టుకునే అమ్మవారి స్వరూపం :**

చతుర్భుజాలతో,రెండు చేతులలో తామర మొగ్గలు,మరో చేతిలో శివలింగం,మరో చేతితో రుద్రాక్షమాలతో తపస్సు చేస్తున్నట్లుగా ఒక యోగి నిలా అర్ధనిమీలిత నేత్రాలతో జ్ఞానముద్రలో ఉన్నట్లు ఎంతో కళాత్మకంగా కనబడుతుంది ఇష్టకా మేశ్వరీ అమ్మవారు.భూగర్భంలోని ఓ చిన్న దేవాలయంలో కొలువుతీరి ఉంటుంది ఇష్ట కామేశ్వ దేవి. కిటికీ మాదిరిగా ఉండే చిన్న ముఖద్వారం ద్వారా మోకాళ్ల మీదుగా ఒక్కరొక్కరుగా లోనికి వెళ్లి అమ్మవారిని దర్శించుకోవాలి. అమ్మవారి దర్శనానికి ముందు మార్గమధ్యంలో వెలసి వినాయకుడిని దర్శించుకోవాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఇష్టకామేశ్వరి అమ్మవారికి పెరుగన్నం,పొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు.శ్రీశైలంలో మల్లికార్జున స్వామి,భ్రమ రాంబాదేవి వెలసిన సమయంలోనే ఇష్టకామేశ్వరి అమ్మవారు ఇక్కడ వెలిశారని స్థల పురాణాలు చెపు తున్నాయి..

**మానవకాంతను పోలిన స్పర్శ నిచ్చే అమ్మవారి నుదురు :**

అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరి చేత స్వయంగా బొట్టు పెట్టించటం ఇక్కడ ఆనవాయితీ. అమ్మవారికి బొట్టు పెట్టేటప్పుడు అమ్మవారి విగ్రహం మాదిరిగా కాకుండా ఒక మానవ కాంత నుదుటిని తాకినట్లుగా మెత్తగా చర్మాన్ని తాకినట్లుగా స్పర్శ ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు.భక్తులు ధర్మబద్ధంగా కోరే ఏ కోరికై నా అమ్మవారు తీరుస్తారని ప్రతీతి.మంగళవారం,శుక్రవారం, ఆదివారం ఇక్కడ విశేష పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు.అమ్మవారికి కొందరు భక్తులు చీర,సారెలను బహూకరిస్తారని వారు తెలిపారు.

**సాహసోపేతమైన దర్శనయాత్ర.. :** నల్లమల అభయారణ్యంలో వెలసిన ఇష్టకామేశ్వరి అమ్మ వారిని దర్శించుకోవాలంటే కాస్తంత సాహసం చేయాల్సిందే.ఈ యాత్ర యావత్తూ వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించే టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతం కావడంతో అటవీశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి.అయితే కొంతకాలంగా ఈ యాత్ర అటవీశాఖ అనుమతులతోనే సాగుతుంది. శ్రీశైలం సమీపంలో ఉన్న శిఖరం వద్ద నుంచి ఈ యాత్ర ప్రారంభమ వుతుంది.శిఖరం వద్ద ఆటవీశాఖ అధికారులు ఉదయం 8 గంటల నుంచి 10గం టల వరకు మాత్రమే ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకోవటానికి టికెట్లు బుక్ చేసుకుంటారు.కాగా దర్శనానికి వెళ్లే రోజు కంటే ముందు రోజే టికెట్లను తీసుకోవాల్సి ఉంటుంది.అలాగే రాత్రి 11 గంటల నుండి క్యూ లైన్ లో భక్తులు వేచి ఉండే పరిస్థితి నెలకొని ఉంటుంది.8 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆలయానికి వెళ్లే ప్రతి వ్యక్తికి రూ.1000 చెల్లించి టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.అలా ఒక్కో వాహనంలో కేవలం 8 మంది మాత్రమే వెళ్లేందుకు అను మతులు ఉన్నాయి.అలా మొత్తంగా రోజుకు 15 జీపులు మాత్రమే వెళ్లేందుకే అనుమతిస్తారు.టికెట్లు పొందిన వారికి మరుసటి రోజు ఉదయం 8 గంటల నుంచి వాహనాలు ప్రారంభమవుతాయి. ఒకవేళ అటవీశాఖ ద్వారా ప్రత్యేక అనుమతులు తీసుకున్న వారికి వివిఐపీలకి ఒక్కొక్క టికెట్ రూ.1500 ఉంటుంది.ప్రస్తుతం ప్రతిరోజు 120 టికెట్లను మాత్రమే విక్రయిస్తారు.అందులో 16 టికెట్లను ఆన్లైన్లో 15 రోజులు ముందుగానే బుక్ చేసుకోవాలి.మిగిలిన టికెట్లను 104 టికెట్లను కౌంటర్ ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రద్దీ లేని రోజుల్లో టికెట్లు అందుబాటులో ఉంటే వెంటనే భక్తులకు ఇచ్చి అదే రోజు దర్శనానికి వెళ్లే వెసులుబాటును కూడా కూడా అటవీ శాఖ కల్పిస్తుంది.ఇలా కష్టసాధ్యమైన యాత్రను చేసే ప్రతి ఒక్కరూ తాము కోరిన కోరికలు నెరవేరాలని కోరుకుంటూ..అవి తీరగానే తమ మొక్కులను తీర్చుకుంటుంటారు.

**శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయానికి పెరిగిన రద్దీ :**

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇష్ట కామేశ్వరి అమ్మవారి ఆలయ దర్శనానికి భక్తుల రద్దీ పెరుగుతోంది.ఓవైపు అటవీశాఖ అనుమతులతో ప్రత్యేక జీప్ లలో అమ్మవారి దర్శనానికి వెళ్తుంటే.. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీబులో మాత్రమే అమ్మవారి ఆలయ దర్శనానికి అనుమతి ఉంటుంది. ప్రస్తుతం శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొందరు సాధారణ భక్తులు,శివ స్వాములు కాలినడకన ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు.బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత సాధారణ రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లో అటవీ ప్రాంతంలో భక్తులని కాలినడకన అనుమతి ఇచ్చే అవకాశం ఉండదు.మార్కాపురం డీఎఫ్ఓ సందీప్ కృపాకర్,సబ్ డీఎఫ్ఓ వేణు ఆదేశాలతో గంజివారిపల్లి రేంజర్ ఆరిఫ్ ఖాన్ పర్యవేక్షణలో అటవీ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ అడవులకు, వన్యప్రాణులకు విఘాతం కలగకుండా భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా అటవీశాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు.

# శ్రీగిరి భక్తజన సంద్రం



క్షేత్ర ప్రధాన వీధుల్లో భక్తుల రద్దీ

- పాదయాత్రతో శ్రీశైలం చేరుకున్న భక్తులు
- ఇరుముడులు సమర్పించిన శివమాలాధారులు
- మల్లన్న దర్శనంతో పరవశం

**శ్రీగిరి భక్తజన సంద్రమైంది.శివ మాలధారులు..కాలినడక భక్తులు.. వాహనాల్లో తరలి వచ్చిన వారితో శ్రీశైలం కిక్కిరిసింది.వందల కిలోమీటర్ల దూరం నుంచి పాదయాత్రగా వచ్చిన భక్తులు మల్లన్న దర్శనంతో అలసట మరిచిపోయి పరవశించిపోయారు. కొందరు ధూళి దర్శనం చేసుకుని ఇరుముడులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. శివనామ స్మరణతో తన్మయత్వం పొందుతున్నారు.**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి నాడు మల్లన్నను దర్శించుకునేందుకు భక్తులు శ్రీశైలం తరలివస్తున్నారు.శివ మాలధారులు తమ కుటుంబ సభ్యులతో పాదయాత్రగా మల్లన్న సన్నిధిని చేరుకుంటున్నారు. పంచాక్షరి నామ స్మరణ పఠిస్తూ చెట్లు,పుట్టలు,కొండలు,కోనలు దాటుకుని ఇల కైలాసం చేరుకుంటున్నారు.భక్తుల శివనామ స్మరణ,ఓంకార ప్రణవనాదాలతో నల్లమల ఆటవీ ప్రాంతం ప్రతిధ్వనిస్తోంది.శ్రీశైల మహాక్షేత్రానికి పాదయాత్రతో వచ్చామని స్వామి వారికి తెలియజేయాలని సాక్షిగణపతికి తమ గోత్రనామాలు చెప్పి శ్రీశైలం చేరుకుంటున్నారు. శివమాల ధారులు..తమకు ప్రత్యేకంగా -కేటాయించిన క్యూల ద్వారా స్వామివారిని అలంకార దర్శనాన్ని చేసుకుని భ్రమరాంబాదేవిని దర్శించుకుని శివదీక్షా శిబిరాలలో సేద తీరుతు న్నారు.అలాగే దేవస్థానం ఏర్పాటు చేసిన గుడారాలు, షామియానాలలో కాసేపు కునుకు తీస్తున్నారు.ఇరుముడి సమర్పించిన స్వాములతో పాటు మహాశివరాత్రి పర్వదినాన జ్యోతిర్ముడులను సమర్పించాలని భావిస్తున్న స్వాములతో పాటు వారితో వచ్చిన కుటుంబ సభ్యులు శివరాత్రి ఘడియల కోసం ఎదురు చూస్తున్నారు.కొందరు భక్తులు కిలో మీటర్ల కొద్ది నడిచి వచ్చి అలాగే ధూళీ దర్శనం చేసుకుని అలసట మరిచి పోయి ఆధ్యాత్మికానందాన్ని పొందుతున్నారు.ఈఏడాది బాల స్వాముల సంఖ్య భారీగా ఉంది.3 ఏళ్ల నుంచి 12 ఏళ్లలోపు వయస్సున్న 12 వేల మందికి పైగా శివమాల ధరించిన బాలలు ఇప్పటికే శ్రీశైలం చేరుకుని ఇరుముడిని సమర్పించారు.మంగళవారం వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తుల అధిక సంఖ్యలో తల్లి రావటంతో క్షేత్రంలో ఎటు చూసినా భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి భక్తులు నేరుగా స్వామి అమ్మవార్ల దర్శనానికి బారులు తీరారు.దీంతో ఆలయం క్యూ లైన్ లన్నీ భక్తులతో కిక్కిరిసాయి. క్యూలైన్లో వేచి ఉండే భక్తులకు 50 గ్రాముల లడ్డు ప్రసాదాన్ని అందజేస్తున్నారు. అలాగే బిస్కెట్లు,వాటర్ బాటిల్ అని కూడా పంపిణీ చేశారు. పాదయాత్ర భక్తుల సౌకర్యార్థం పలువురు దాతలు అన్నదానం, అల్పాహారం,మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలను చేస్తున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నారు.



ఇరుముడులతో దర్శనానికి వెళ్తున్న శివమాల ధారులు





భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు



పాదయాత్రగా తరలి వస్తున్న భక్తులు





పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించేందుకు పోటెత్తిన భక్తజనం

## శ్రీశైలంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ



సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ లో డీఐజీ

**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలంలో భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు.ఆలయ క్యూ లైన్లు, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ తదితరాలను ఆయన పరిశీలించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. డిఐజీ వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్,డీఎస్పీ రామాంజి నాయక్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి,శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు తదితరులున్నారు.

## శ్రీశైల మల్లన్న సన్నిధిలో జగద్గురు పీఠాధిపతి



పీఠాధిపతికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న దృశ్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 1008 డాక్టర్.చెన్న సిద్ధరామ పండితారాధ్యా శివాచార్య మహాస్వామీజీ మంగళవారం దర్శించుకున్నారు.ఆలయ రాజగోపురం వద్ద మహా స్వామీజీకి ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.ఈసందర్భంగా స్వామీజీ శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పీఠాధిపతుల గౌరవార్థం వేద గోష్టి నిర్వహించారు.

## లింగాలగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో కలెక్టర్ పూజలు



టెంపుల్ నిర్వాహకులతో నంద్యాల జిల్లా కలెక్టర్, జెసీ

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం డ్యామ్ దిగువన గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ కూడా ఉన్నారు.ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు,టెంపుల్ నిర్వాహకులు చింతకాయల సోమేశ్,కోదండం,రమణ,మల్లేష్, చిన్న,రమణ తదితరులు ఉన్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టులో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ వద్ద సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.గల్లంతైన ఎనిమిది మంది ఆచూకీ కోసం



తెలంగాణ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది.వారిని కాపాడేందుకు ఇండియన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్,హైడ్రా,రాట్ మైనర్స్, సింగరేణి తదితర రెస్క్యూ బృందాలు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి.మంగళవారం మరి కొంతమంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది టన్నెల్ వద్దకు వెళుతూ మార్గమధ్యంలో శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ఓ హోటల్ వద్ద కాసేపు ఆగారు.

## గవర్నర్ కి వీడ్కోలు పలికిన మంత్రి ఫరూక్,ఎమ్మెల్యే బుడ్డా



గవర్నర్కు హెలీప్యాడ్ వద్ద వీడ్కోలు పలుకుతున్న మంత్రి,ఎమ్మెల్యే

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకొని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉదయం హెలికాప్టర్లో రాజ్ భవన్కు బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద గవర్నర్ కు మంత్రి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి,ఇన్చార్జీ ఎస్పీ విక్రాంత్ పాటిల్,జేసీ విష్ణు చరణ్తో కలిసి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం టీడీపీ ఇన్చార్జీ వై.యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మత్తులు..

**కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన ఆర్డీఓ..**
**మరమ్మత్తు పనులకు రూ.29.50 లక్షల నిధులు మంజూరు.**
**మరమ్మత్తులతో మమా అనిపించాలని..**


శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మతులు చేపడుతున్న భవనం ఇదే

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని చిన్నవంగలి గ్రామంలో ఉన్న ఎస్సి సాంఘిక సంక్షేమ వసతి గృహ భవనం కాలం చెల్లడంతో భవనం పై కప్పు పెచ్చూలూడి, గదులలోని గోడలకున్న ప్లాసింగ్ వర్షపు నీరు దిగి దెబ్బ తినగా, బండపరుపు దిగబడి పోయి అక్కడక్కడ పగిలిపోయి, స్నానపు గదులు, మరుగుదోడ్లు శిథిలావస్తకు చేరుకుని విద్యుత్తు సరఫరా, స్వీచ్ బోర్డులు నిర్వీర్యంగా మారాయి. ఈ సమస్యను ఆగస్టు నెలలో అప్పటి నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి దృష్టికి సంక్షేమ అధికారి తీసుకెళ్ళారు. దీంతో ఆర్టిఓ. చిన్నవంగలి గ్రామంలోని సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణం కోసం జిల్లా కలెక్టరు రాజకుమారి గణియాకు ప్రతిపాదనలు పంపారు. అయితే కలెక్టర్ ఆదేశాల మేర కు నంద్యాల జిల్లా పంచాయితీరాజ్ ఈఈ, ఇంచార్జ్ ఎస్ఈ నాగరాజు సాంఘిక సంక్షేమ భవనాన్ని పరిశీలించి భవనం శిథిలావస్తకు చేరుకోలేదని కొన్ని మైనర్ మరమ్మత్తులు చేస్తే ఇంకా 20


హాస్టల్ విద్యార్థులు నేల పైన కూర్చుని చదువుకుంటున్న దృశ్యం

సంవత్సరాల కాలంపాటు భనం చెక్కుచెదరదని నివేధించారు. దీంతో స్పందించిన కలెక్టర్ రాజకుమారి గణియా మరమ్మత్తు పనులకు రూ. 29.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పంచాయితీ రాజ్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. ఈ పనులను పెద్దవంగలి గ్రామానికి చెందినకాంట్రాక్టర్ సంజీవరాయుడు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ మరమ్మత్తు పనులు కొనసాగుతుండడంతో విద్యార్థులకు ప్రత్యామ్నాయం లేక పోవడంతో ఇబ్బందులకు గురౌతూ ఆ భవనంలోనే కొన్ని గదులలో వసతి పోందుతున్నారు. 10వ తరగతి విద్యార్థులు మార్చి నెల నుండి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో పరీక్షలకు సన్నంద్ధం కావటానికి ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. ఏదీ ఏమైనా మరమ్మత్తులకు వ్యయం చేసే నిధులు నిర్వీర్యం అవుతున్నాయని గ్రామస్తులు అభిప్రాయ పడుతున్నారు. పాతభవనాన్ని కూల్చివేసి దాని స్ధానంలో నూతన భవనం నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని, మండలంలో స్వంత భవనం కలిగిఉన్న ఏకైక ఉన్నసాంఘిక సంక్షేమ వసతి గృహం ఇదే కావడంతో నూతన భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైన ఉన్నత. అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మిర్చి రైతుకు అండగా కూటమి ప్రభుత్వం

**రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి**
**మిర్చి క్వింటానికి రూ. 11,871 మద్దతు ధర ప్రకటించడంపై హర్షం**

**పెద్దకడబూరు, మేజర్ న్యూస్:**
'రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎంతో కష్టపడి పండించిన మిరప పంటకు గిట్టుబాటు ధరలేక నష్టాల్లో కూరుకుపోయిన మిర్చి రైతుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది' అని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న మిరప రైతులకు మద్దతు ధర కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంతో మిర్చికి కేంద్రం క్వింటానికి రూ. 11871కనీస ధర ఇవ్వడం పట్ల మంగళవారం రమాకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మిర్చికి కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర వల్ల రైతాంగానికి ఎంతో భరోసాను ఇచ్చినట్లయ్యింద న్నారు. గతంలో కూడా మిర్చి రైతుకు చంద్రబాబునాయుడు అండగా నిలిచిన సంగతిని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం మిర్చి ధరలు దారుణంగా పతనం కావడంతో పాటు సాధారణ రకాలు క్వింటం మిర్చి రూ. 9 వేలు కూడా దాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన సీఎంచంద్రబాబు నాయుడు వెంటనే వ్యాపారులు, ఎగుమతి దారులతో సమావేశం నిర్వహించి రైతుకు మద్ధతు ధర లభించేలా సీఎం కృషి చేశారని తెలిపారు. రాష్ట్రంలోని మిర్చి రైతును ఏపీ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. రైతులు ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని మిరపకు మద్ధతు ధర ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నరవ రమాకాంత్ రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.


రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి
నరవ రమాకాంత్ రెడ్డి

# ముగిసిన బీసి కార్పోరేషన్ రుణాల ఇంటర్వ్యూలు..ఎంపిడిఓ సుహాసినమ్మ


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపిడిఓ, బ్యాంక్ అధికారులు

**వెల్దుర్తిరూరల్, మేజర్న్యూస్ః** మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు బీసి కార్పోరేషన్ రుణాలకు మంగళవారం ఇంటర్వ్యూలను బ్యాంకుల అధికారులతో ఎంపిడిఓ సుహాసినమ్మ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసి, ఈబీసి(కాపు, బలిజ, తెలగ) కులాలకు చెందిన లబ్దిదారులకు బ్యాంకుల అనుసంధానంతో సబ్సిడీతో కూడిన రుణాలకు సంబందించిన 875 దరకాస్తులు అన్లైన్ ద్వారా వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. దాదాపు మండలానికి 59 యూనిట్లు మంజూరైనట్లు ఎంపిడిఓ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ముఖ్య అతిధులుగా వెల్దుర్తి స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, వెల్దుర్తి ఏపిజీబి గ్రామీణ బ్యాంక్, రామళ్ళకోట కెనరా బ్యాంక్, గోవర్ధనగిరి ఏపిజీబీ గ్రామీణ బ్యాంక్, కలుగొట్ల కెనరా బ్యాంక్ అధికారులు హజరై దరఖాస్తుదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

# కలర్ పెన్సిల్ ముల్లుపై అతీ చిన్న శివలింగం

**– 0.5సెం.మీ., అతీ చిన్న శివలింగం – అబ్బుర పరుస్తున్న చిన్నారి సూక్ష్మ కళాకృతి**


శివలింగాన్ని చూపిస్తున్న చిన్నారి

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని మండలం అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి హెచ్.శ్రావ్య మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కలర్ పెన్సిల్ ముల్లుపై 0.5సెం.మీ., కలిగిన అతీచిన్న సూక్ష్మ కళాకృతి శివ లింగ అకృతిని తయారు చేసి అబ్బుర పరిచింది. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఎన్. కీరా ప్రత్యేక శిక్షణతో ఈ సూక్ష్మ కళాకృతిని చేసినట్లు తెలిపింది. ఈ సూక్ష్మకళాను తయారు చేయడానికి ఒక గంట సమయం పట్టిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజాదేవి విద్యార్థినీ హెచ్ శ్రావ్యను డ్రాయింగ్ ఉపాధ్యాయుడు కీరాను ప్రత్యేకంగా అభినందించారు.


పెన్సిల్ ముల్లు ముక్కపై శివలింగం

## పాడి పశువులకు
# భీమా తప్పనిసరి

**అవుకుమేజర్,న్యూస్ః** పాడి పశువులకు భీమా చేయించుకోవాల్సిందిగా పశు వైద్యాధికారి డాక్టర్ భారతి మంగళవారం తెలిపారు. స్థానిక పశువైద్యాశాల నందు పారవేట్స్, ఏహెచ్ఎల్, గోపాల్ మిత్రలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం 21వ పశుగణన మార్చి 1వ తేదీ నుండి గాలికుంటు నివారణ టీకాలు, పాడి పశువులకి మరియు ఎద్దులకి పశుభీమా విషయమై సమావేశం నిర్వహించారు. ప్రతి రైతులకు భీమా ఉపయోగాలు తెలియజేయాలని ఏహెచ్ఎల్కు చెప్పడం జరిగింది.

# సబ్సీడీ రుణాల కోసం లబ్దిదారుల ఎంపిక



**కృష్ణగిరి మేజర్ న్యూస్ :** బిసి కార్పొరేషన్లో సబ్సీడీ రుణాల కోసం కటారుకొండ,ఆలంకొండ, లక్కసాగరం గ్రామాల నుండి దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు.ఎంపిడిఓ జి. మోహన్కుమార్ ఆధ్వర్యంలో డోన్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ జయదేవి లబ్దిదారుల ఎంపికను చేపట్టారు.ఈ కార్యక్రమంలో పరిపిలన అధికారి రామస్వామి ,సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో మంగళవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు బీసీ కార్పొరేషన్ స్వయం ఉపాధి కల్పనకు ఇంటర్వ్యూ లు నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ ద్వారా 57 యూనిట్లకు ఇంటర్వ్యూ లు నిర్వహించగా అందుకుగాను మండల పరిధిలోని నాలుగు బ్యాంకుల అధికారులు మండల అధికారుల సమక్షంలో మొత్తం 662 మంది అప్లై చేసుకోగా వీరిలో 215 మంది మాత్రమే హాజరు కాగా మిగిలినవారు గైహాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటర్వ్యూ లు సజావుగా సాగయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ.రాణెమ్మ, ఏఓ. శ్రీనివాసులు, సినియర్ అసిస్టెంట్ జయ ప్రకాష్, సి. బెళగల్ కెనరా బ్యాంకు అధికారి శ్రీనివాసానాయక్, ఏపీజీబీ అధికారి మల్లికార్జునరెడ్డి, పోలకల్ ఏపీజీబీ అధికారి అసిఫ్ ఇస్మాయిల్, కొత్తకోట ఏపీజీబీ అధికారి అమిత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.


పత్రాలను పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

# అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి.. సిఐటియు



**పాములపాడు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పేద గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలకు అంగన్వాడి వర్కర్లు మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ శివలక్ష్మి రమణ బాయిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రభుత్వ సంక్షేమపథకాలు అంగన్వాడీలకు కూడా అందించాలన్నారుఖర్చు పెట్టుకుని సెంటర్లు నిర్వహిస్తున్నామని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీ వర్కర్లు మినీ వర్కర్లు హెల్పర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారితే అంగన్వాడీ కష్టాలు తీరుతాయని కూటమి ప్రభుత్వానికి ఎన్నుకోవడం జరిగిందన్నారు ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతున్న అంగన్వాడీల సమస్యల భారం అలానే ఉందని రకరకాల యాప్ లతో పని భారం పెరిగిందన్నారు అంగన్వాడీల వేతనాల పెంపు గత ప్రభుత్వంలో 40 రోజులు సమ్మె నిర్వహిస్తే టిడిపి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచి ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు.ఆ వైపు చర్యలు లేవు అంగన్వాడీల కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి గ్రాట్యూటీ అమలు చేయాలి రాష్ట్రంలో ఉన్న మినీ సెంటర్లు అన్నింటిని మెయిన్ సెంటర్లు చేస్తూ జీవో ఇవ్వాలని సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని కోరారు.

# వైభవంగా ఫేర్వెల్ డే సెలబ్రేషన్స్


నృత్యాలు చేస్తున్న విద్యార్థినీలు

**వెల్దుర్తి, మేజర్న్యూస్ః** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీసత్యసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు మంగళవారం ఫేర్వెల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా ఎంతో ఉత్సాహ భరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కరస్పాండెంట్ జీవి.రమణ ఆధ్వర్యంలో కొనసాగింది. 9వ తరగతి విద్యార్థులు, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి అద్భుతమైన విందుతోపాటు పదవ తరగతి కామన్ పరీక్షలకు హజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు మరియు పరీక్ష సామాగ్రిని బహుకరించారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి హెచ్ఎం గఫూర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసి వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులు నైతిక విలువలను పాటించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్క ృతిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల నృత్యాలను చూసి ఎంతో ఆనందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్రాజు, స్కూల్ డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వ్యక్తి పై దాడి.. కేసు నమోదు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కొలిమిగుండ్ల మండలంలోని హనుమంతుగుండం గ్రామంలో ఇంటి స్థలం విషయంలో షేక్ నబిరసూల్ (56) తండ్రి షేక్ మాబు అను వ్యక్తికి అదే గ్రామానికి చెందిన గుత్తిగారి జయరామిరెడ్డి, రామగోపాల్ రెడ్డి అను వ్యక్తులు కాళ్లతో, చేతులతో కొట్టి చంపుతామని బెదిరించారని షేక్ నబీ రసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ రమేష్ బాబు తెలిపారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఎరువుల అంగడి పై కేసు నమోదు


ఎరువుల దుకాణం రికార్డును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** చాగలమర్రిలోని న్యూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణమును తనిఖీ చేసి గత వారం అధిక ధరకు యూరియా అమ్మకం జరిపినందుకు గాను సదరు యూరియా స్టాకును సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేయడం జరిగింది. అదే విధంగా ఎరువుల లైసెన్స్ సస్పెండ్ చేసి 15 రోజుల పాటు ఎటువంటి అమ్మకాలు జరపకూడదని ఆదేశాలు జారి చేయడం జరిగింది. లైసెన్స్ సస్పెండ్ చేసిన కారణం చేత ఏరోజు నుండి తదుపరి 15 రోజులు వరకు రైతులు సదరు న్యూ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర ట్రేడర్స్ నందు ఎటువంటి ఎరువుల కొనిగోలు చేయరాదని తెలిజేయడమైనది. ఒక వేల అమ్మకాలు జరిపినట్లు నిర్ధారణ అయితే సదరు లైసెన్స్ రద్దు చేయబడును అని తెలిజేయడమైనది. ఈ యూరియా గత వారంలోని ఆర్.బి.కె కేంద్రాలతో రైతుల పేరుతో కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రావడంతో 113 ఏరియా బస్తాలను గుర్తించడం జరిగింది. యూరియా సంబంధించి ఏలాంటి బిల్లులు చూపకపోవడంతో కేసు నమోదు చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి రంగ నేతాజీ తెలిపారు.

# నేడు మహాశివరాత్రి

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో మహాశివరాత్రి వేడుకలకు శివుని దేవాలయాలు ముస్తాబు చేస్తారు. ఈసందర్భంగా మండలంలోని గొల్లల దొడ్డి, కృష్ణదొడ్డి గ్రామాలలో శివాలయాలతో పాటు ఆయా గ్రామాల శివాలయాలను సిద్ధం చేసి ఆ శివపార్వతుల వివాహము హోత్సవాని ఎంతో భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు,మహాశివరాత్రి హిందువులు ప్రతేకంగా ఆచరించే ముఖ్యమైన పండుగరోజు, ఈరోజు శివపార్వాతుల వివాహం జరిగిన రోజు,ఈ రోజు శివుడు తాండవం ఆడేరోజు, శితకాలం చివర్లో వేసవి కాలం ముందు వచ్చే మాఘమాసంలో ఫ్రిబ్రవరి లేదా మర్చి వచ్చే 13లేదా 14రోజుని మహాశివరాత్రి అంటారు. ఈరోజు శివుడు లింగకారంగా ఆవిర్భవించాడని శివ పురాణంలో వుంది,రోజంతా ఉపవాసం,రాత్రింతా జారగణ చేస్తారు. ఈనాడు శివ భక్తులు తెల్లవారుజామున లేచిస్నానం,పూజలుచేసి, ఉపవాసం ఉండి రాత్రంతా జాగరణము చేసి మరునాడు భోజనం చేస్తారన్ని భక్తులు తెలిపారు.


గొల్లల దొడ్డి గ్రామంలో లింగదర్శనమిస్తున్న శివుడు


క్రిష్ణదొడ్డి గ్రామంలో లింగ రూపంలో వెలసిన శివుడు

## గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

**పరామర్శించిన బైరెడ్డి రాజశేఖరరెడ్డి**



**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల పరిధిలోని మాస పేట గ్రామంలో గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడు చాకలి గోపాల్ 64 గుండెపోటుతో సోమవారం రాత్రిమృతి చెందాడు విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కొద్ది సేపటికే ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడమ్ తో ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో చనిపోయాడని బంధువులు తెలిపారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిమృతదేహాన్ని సందరిర్శంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. టీపీపీ నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో రాణించిన గ్రామీణ విద్యార్థి


మధురోహిత్ (ఫైల్ ఫోటో)

**బనగానపల్లెరూరల్,న్యూస్ః** జాతీయస్థాయిలో జరిగే నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు బనగానపల్లె మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన విద్యార్థి గంగారపు మధురోహిత్ ఎంపికయ్యారు. బనగానపల్లెలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మదురోహిత్ నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం జరిగింది. ఈ విద్యార్థికి నాలుగు సంవత్సరాలపాటు ప్రతి సంవత్సరంలో 12వేల రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించడం జరుగుతుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మధు రోహిత్‌ను ప్రధానోపాధ్యాయులు రామక్రిష్ణయ్య, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

## నంద్యాల జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

**నంద్యాల డి సి సి అధ్యక్షుడు నరసింహ యాదవ్**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :**



నంద్యాల జిల్లా ప్రజలకు నంద్యాల డి సి సి అధ్యక్షుడు లక్ష్మి నరసింహ యాదవ్ మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక భావనతో ఉపవాసం ఉండి పవిత్రంగా జరుపుకుంటారన్నారు. పరమేశ్వరుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని లక్ష్మి నరసింహాయాదవ్ ఆకాంక్షించారు.

## మండల ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు



**వెల్దుర్తి,మేజర్ న్యూస్ :** నేడు మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వెల్దుర్తి మండల పోలీసులు మండల ప్రజలకు,శివ భక్తులకు వెల్దుర్తి ఎస్సై జి.అశోక్ మహా శివరాత్రి శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివరాత్రి జాగరణకు విచ్చేస్తున్న భక్తాదులకు పలు సూచనలు చేశారు. రేపటి నుండి జరగబోయే బ్రహ్మగుండ తిరుణాల సందర్భంగా విచ్చేయుచున్న భక్తులు అందరు వారి వారి వాహనాలను పోలీసులు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలోనే వారి వాహనాలను పెట్టుకోవాలని కోరారు. పుణ్యక్షేత్రపరిసరాలలో మద్యం సేవించడం, మహిళలు/అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేరే ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిషిద్ధం అని అట్లు అతిక్రమించినచో వారి పైన కఠిన చర్యలు తీసుకోబడుతాయని మండల యువత అందరు ఎలాంటి గొడవలు చేయకుండా సంయమనంతో ఉండాలని, లేని చో వారిపైన కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. క్షేత్రం పోలీస్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, మహిళలు, భక్తులను ఇబ్బందులకు గురిచేసిన వారికి పోలీస్ కౌన్సిలింగ్ ఇవ్వబడునని హెచ్చరించారు. దయచేసి అందరు పోలీస్ వారికీ సహకరించవలసిందిగా కోరుతున్నామన్నారు.

## పంట నమోదు తప్పనిసరి-ఏ ఓ ప్రమీల


రైతు రిజిస్ట్రీ ని పరిశీలించిన ఏఓ. ప్రమీల

**దొర్నిపాడు, మేజర్ న్యూస్ :** రబీలో రైతులు సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికా రిని ప్రమీల రైతులకు సూచించారు మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమా న్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు పంట నష్టం జరిగినపుడు ప్రభుత్వం నుండి పంట భీమా వర్తిస్తుందని ఆమె అన్నారు. ఈ పంట నమోదు చేసుకోవడానికి మార్చి 1వ తేదీ చివరి తేది అని ఆమె అన్నారు రైతులు తప్పకుండ ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో జరుగుచున్న పార్మర్ రిజిస్ట్రీకార్యక్రమాన్ని పరిశీలించారు రైతులు తప్పనిసరిగా రైతుసేవా కేంద్రాలకు వెళ్లి రైతు రిజిస్ట్రీ చేసుకొని ప్రతి రైతు వ్యక్తిగత 11అంకెల నెంబర్‌ను పొందాలని ఆమె సూచించారు. మండల వ్యవసాయ అధికారిని ప్రమీల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగారెడ్డి రైతులు పాల్గొన్నారు.

## లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయిస్తున్న బి.సి ఇందిరమ్మ


లడ్డూ తయారు చేయిస్తున్న బి.సి ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాన్ని అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఇచ్చిన హామి మేరకు వారి సతీమణి బి.సి ఇందిరమ్మ తానే దగ్గర ఉండి స్వయంగా లడ్డూ తయారీ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ మాట్లాడుతూ యాగంటి క్షేత్రంలో వెలిసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వారి సొంత నిధులతో లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు మూడు రోజులపాటు ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా యాగంటి క్షేత్రంలో ఎన్నడూ లేని విధంగా మూడు రోజులపాటు టోల్‌గేట్ తీసివేయడం జరిగిందని వాహనాలతో వచ్చే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బనగానపల్లె పట్టణమే కాకుండా అన్ని గ్రామాలలో ప్లాస్టిక్స్ నిర్మూలనకు సహకరించాలని యాగంటి క్షేత్రంలో కూడా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అద్యక్షులు టంగుటూరి శీనయ్య, బత్తుల భాస్కర్ రెడ్డి, బండి హర్షవర్ధన్ రెడ్డి, బొబ్బల మధన్ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆదోని సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన గుడిసె కృష్ణమ్మ

**పరిపాలనా సౌలభ్యం కోసం ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని వినతి**


జిల్లా కలెక్టర్ ను కలిసిన ఆదోని టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ.

**ఆదోని, మేజర్ న్యూస్:** ఆదోని టిడిపి మాజీ ఇంచార్జ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ మంగళవారం కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కర్నూలులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదోనికి సంబంధించిన పలు అంశాలను కృష్ణమ్మ ఈ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. ప్రధానంగా ఆదోనిలో రోడ్ల వెడల్పు, పట్టణంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు తదితర వాటిని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆదోని నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యల గురించి ప్రస్తావించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజా సేవల కోసం ఇప్పటివరకు అతిపెద్ద మండలంగా ఉన్న ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని జిల్లా కలెక్టర్ ను గుడిసె కృష్ణమ్మ కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు కృష్ణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగనాథనల్లి రవి, రాఘవరెడ్డి, చిరంజీవి, కుప్పగల్లు హనుమంతు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ముద్దాయికి ఒక ఏడాది జైలు శిక్ష..

**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామం లోనిరైతు భరోసా కేంద్రానికి ఉన్న తాళం పగులకొట్టి ,అక్రమంగా ప్రవేశించిటీవీ, వాషింగ్ మిషన్, ప్రెజర్ కుక్కర్, కిట్,మాయిశ్చరైజరమిషన్, ఎల్ఈడి బల్బ్స్ దొంగలించిన కేసులో ముద్దాయి నరవ భాస్కర్ ఆచారికి ఏడాది జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాను ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ విధించినట్లు ఎస్సై దిలీప్ కుమార్ తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన సరవ భాస్కర్ ఆచారి జల్సాలకు అలవాటు పడి పలు మార్లు దొంగతనాలు చేయసాగాడు. అందులో భాగంగా మొలగవల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో తాళం పగలగొట్టి పలు వస్తువులను దొంగలించినట్లు పోలీసులు గుర్తించి ముద్దాయిని అరెస్టు చేసి, రిమాండ్ కి పంపి ఆలూరు కోర్టు నందు చార్జిషీట్ దాఖలు చేయగా ఆలూరు కోర్టు జడ్జి గారు విచారించి ముద్దాయికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష మరియు ఐదువేల రూపాయలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లు గిరి,సుంకన్న లు పాల్గొన్నారు.



సూర్య
బుధవారం | 26 ఫిబ్రవరి 2025







# శ్రీ భ్రమరాంబ సమేత శంకర మల్లేశ్వర స్వామి త్రియాహిక మహోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వస్తున్న డైరెక్టర్ దంపతులు

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండలంలోని తూడిచెర్ల గ్రామంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు గణపతి పూజ, అమ్మా భవాని, లింగమయ్య స్వామి,కాశిరెడ్డి నాయన స్వామి, గోమాత పూజా కార్యక్రమాలు రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాశివరాత్రి ఎంతో పర్వదినం అని వారు పేర్కొన్నారు. స్వామి వారిని దర్శించుకుని కృపకు పాత్రులుకావాలని కోరారు.

# పాగాలంకరణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయండి

## నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** పాగాలంకరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, జెసి విష్ణు చరణ్ తో కలిసి మంగళవారం ఆలయ క్యూలైన్లు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం జరగనున్న ముఖ్యమైన పాగాలంకరణ కార్యక్రమానికి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.పాగాలంకరణలో రాజకీయ నాయకులు,పుర ప్రముఖులు,భక్తులు,ప్రజలు రానున్న సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రేక్షకులు కూర్చునే ప్రదేశాలను, ప్రేక్షకులు వచ్చు ప్రదేశాలలో వెళ్ళు ప్రదేశాలలో ఎలాంటి తొక్కిసలాటకు,అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.భక్తులు కూర్చునేందుకుకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు.అనంతరం గజ వాహన సేవ కార్యక్రమంలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

# ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన పోతుదొడ్డి విద్యార్థినీ



**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** 2024 డిసెంబర్ 8వ తేదిన 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో పోతుదొడ్డి గ్రామంలోని జడ్పిహెచ్ స్కూల్‌కు చెందిన విద్యార్థినీ జె.జాహ్నవీ ఎంపిక కావడం సంతోషకరంగా ఉందని హెచ్‌ఎం బి.మద్దయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినీ జాహ్నవీని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# ఆళ్లగడ్డలో నకిలీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హల్ చల్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి డ్రగ్ ఇన్ స్పెక్టర్ పేరుతో మంగళవారం హల్ చల్ చేశాడు. పట్టణంలోని మందుల దుకాణాల వద్దకు వెళ్లి తాను డ్రగ్ ఇన్ స్పెక్టర్ ను అని చెప్పి జండుబాం తదితర మందులు తీసుకున్నారు. ఇతని వాలకంపై అనుమానం వచ్చిన మందుల దుకాణాల యజమానులు గుర్తు తెలియని వ్యక్తి తను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను అని పట్టణంలో తిరుగుతున్నాడని పోలీసు ల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. పోలీసులకు సమాచారం అందించిన విషయాన్ని గమనించిన సదరు నకిలీ డ్రగ్ ఇన్ స్పెక్టర్ అక్కడి నుండి పరార య్యారు.దీంతో మందుల దుకాణాల యజమానులు ఫోటోతో సహా ఆళ్లగడ్డ అర్బన్ పోలీస్ స్టేషన్ లో వివరాలు అందించారు. నకిలీ డ్రగ్ ఇన్ స్పెక్టర్ పేరుతో మందుల దుకాణాల వద్దకు వెళ్లిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఆళ్లగడ్డ పట్టణంలో నకిలీ డ్రగ్ ఇన్ స్పెక్టర్ హల్ చల్ చేయడం చర్చాంశనీయంగా మారింది. ఎవరైనా అధికారులని డ్రగ్ ఇన్ స్పెక్టర్‌లమని ఎవరి దగ్గరకు అయిన వచ్చి బెదిరింపులకు పాల్పడితే వారి ఆధారాలు అడగాలని అనుమానం వస్తే ఆ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారుల ద్వారా వివరాలు తెలుసుకోవాలని సూచిస్తు న్నారు.ఇలా ప్రభుత్వ అధికారులమంటూ వచ్చి మోసం చేసే నకిలీలను నమ్మి మోసపోవద్దని పోలీసులు వ్యాపారులను హెచ్చరిస్తున్నారు.



# ఎన్‌టిఆర్ వైద్య సేవకు ఇంప్లిమెంటేషన్ ప్రాపర్‌గా జరగాలి

## :- సూపరింటెంటెండ్ వెంకటేశ్వర్లు

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆసుప్రతిలో ఎన్‌టిఆర్ వైద్య సేవకు సంబంధించిన ఇంప్లిమెంటేషన్ ప్రాపర్‌గా జరిగేటట్లు చూసుకోవాలని ప్రభుత్వ ఆసుప్రతి సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు హెచ్ఓడిలను ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాల ధన్వంతరి హాల్‌లో వివిధ విబాగాల హెఓడిలతో ఐవిఆర్ఎస్,ఎన్‌టిఆర్ వైద్య సేవ మరియు ఈ హాస్పిటల్,పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఈ హాస్పిటల్‌లో ఇంప్లిమెంటేషన్ పలు విభాగాలలో ఓపి మరియు డిశ్చార్జ్ మాడ్యూల్ ఇంప్రూవ్‌మెంట్ చేయాలన్నారు. ఐవిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సిస్టంలోని ఆరు అంశాలపై సమీక్ష జరిపి తగు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో పలు విభాగాలను సర్‌ప్రైజ్ విజిట్ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. శ్రీరాములు,ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఓ డా. వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రమణ్యం, హెచ్ఓడీస్, డా. శ్రీనివాసులు,డా. ఇక్బాల్ హుస్సేన్,డా.లక్ష్మీబాయి,డా. హరిచరణ్,డా. మాధవి శ్యామల, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్స్, డా. శివబాల నగాంజన్,డా. కిరణ్‌కుమార్ తదితరులున్నారు.




మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

# మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లను ఏఎస్పీ జావలి పరిశీలించారు. మంగళవారం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి ఆలయ అధికారులతో చర్చించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రశాంత వాతావరణంలో స్వామి వార్ల దర్శనం చేసుకుని వెళ్లే విధంగా ఏర్పాట్లు ఉండాలని లోటుపాట్లను గమనించి అధికారులకు సూచించారు. ఆలయంలోని కోనేటి పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, తదితర వాటిని పరిశీలించారు. వీరి వెంట తహశీల్దార్ రమాదేవి, ఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ మధు, మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఏఎస్పీ

# కొత్తపల్లిలో వరి గడ్డి దగ్ధం

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన కొత్తపల్లి గ్రామంలో ప్రమాదవ శాత్తు వరి గడ్డి దగ్ధమై బూడిదగా మారింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటర మణ, మల్లయ్యలు గ్రామానికి చివరలో కల్లంలో వరి గడ్డిని తొలుకొని వాము వేసేందుకు సిద్ధంగా ఉంచుకున్నారు. ప్రమాదవ శాత్తు వరి గడ్డికి నిప్పు అంటుకుంది. గ్రామస్థులు గమణించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపు కాలేదు. వెంటనే ఆత్మకూరు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.2 లక్షలపైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించాలని బాధితులు తెలిపారు.